## 30 వేల దరఖాస్తులు డిస్పోజ్

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూశాఖ నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్ కొనసాగుతున్నది. ధరణిలో పెండింగ్‌లో ఉన్న 2.5 లక్షల దరఖాస్తులను పరిష్కరించేందుకు ఈ నెల 1 నుంచి స్పెషల్ డ్రైవ్ ప్రారంభమైన సంగతి తెలిసిందే. నాలుగు రోజుల్లో సుమారు 30 వేల దరఖాస్తులను అధికారులు డిస్పోజ్ (తిరస్కరణ) చేసినట్టు సమాచారం. మండల స్థాయి నుంచి సీసీఎల్‌ఏ వరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి దరఖాస్తులను పరిష్కరిస్తున్నారు.

## టానిక్ లిక్కర్ దుకాణాలపై జీఎస్టీ అధికారుల దాడులు

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): టానిక్ లిక్కర్ గ్రూప్స్‌పై జీఎస్టీ అధికారులు దాడులు చేశారు. హైదరాబాద్‌లో టానిక్ గ్రూప్‌కు 11 ఫ్రాంచైజీలు ఉన్నాయి. క్యూ బై టానిక్ పేరుతో మద్యం దుకాణాలు నిర్వహిస్తున్నది. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులు తనిఖీలు చేశారు. వీటికి ఏ4 ఎలైట్ కింద లైసెన్స్ జారీ అయ్యిందని అధికారులు గుర్తించారు. ఇది ఎక్సైజ్ పాలసీకి విరుద్ధంగా ఉన్నదని చెప్తున్నారు.

## జర్మనీ భాష శిక్షణార్థులతో రాయబారి సమావేశం

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): గచ్చిబౌలిలోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో జర్మనీ భాషా నైపుణ్యంలో శిక్షణ పొందుతున్న పలువురు నర్సింగ్ అభ్యర్థులతో మంగళవారం జర్మనీ దేశ రాయబారి హెచ్‌ఈ డాక్టర్ ఫిలిప్ అకెర్‌మాన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన శిక్షణార్థులతో జర్మన్‌లో సంభాషించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణీ కుమిదిని, నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ విద్యావతి, న్యాక్ డైరెక్టర్ జనరల్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్) ఆధ్వర్యంలో జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు ఎంపికైన 120 మంది అభ్యర్థులకు ఆ దేశ నిధులతో ఐదు బ్యాచ్‌లలో శిక్షణ ఇస్తున్నారు.



బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో వేముల ప్రశాంత్‌రెడ్డి, హరీశ్‌రావు, బాల్కసుమన్, దేశపతి శ్రీనివాస్ తదితరులు

# బీఆర్‌ఎస్‌తో బీఎస్పీ పొత్తు

మొదటిపేజీ తరువాయి...

అంశాలతోపాటు అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కూడా సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై కూడా చర్చించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో బీఎస్పీతో కలిసి పనిచేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీకి ఎలాంటి అభ్యంతరంలేదని కేసీఆర్ స్పష్టంచేశారు. కేవలం రాజకీయాల కోసమే కాకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి పనిచేద్దామని, ప్రజా సమస్యలపై కూడా కలిసి పోరాడుదామని సూచించారు. తమ పార్టీ అధిష్ఠానం సైతం బీఆర్‌ఎస్‌తో కలిసి పనిచేసేందుకు ఆసక్తిగానే ఉన్నదని ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రజల జీవితాల్లో గుణాత్మకమైన మార్పు తీసుకురావాలన్నదే తమ పార్టీ లక్ష్యమని, పార్టీ జాతీయ స్థాయిలో అనేక కార్యక్రమాలను తీసుకొని పనిచేస్తున్నదని వివరించారు. కలిసి పనిచేసినప్పుడే ప్రజలకు మేలు జరుగుతుందని, సంఘటిత శక్తితోనే ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోగలమని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారు. కేవలం ఓట్లు, సీట్ల కోసమే కాకుండా భవిష్యత్తులో కూడా కలిసి పనిచేయాలనే నిర్ణయానికి వచ్చారు.

### బీఎస్పీతో కలిసి పనిచేస్తాం: కేసీఆర్

> సమావేశం ముగిసిన అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, బీఎస్పీ కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాయని తెలిపారు. సిద్ధాంతపరంగా అనేక విషయాల్లో రెండు పార్టీల మధ్య సారుప్యత ఉన్నదని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి దళితబంధు అమలు, రెసిడెన్షియల్ పాఠశాలల ఏర్పాటు, వెనకబడినవర్గాలు, బలహీనవర్గాల అభ్యున్నతికి అనేక పథకాలను అమలుచేసిన చరిత్ర ఉన్నదని వివరించారు. వీటన్నింటిని చూసిన తర్వాతనే బీఎస్పీ నుంచి ప్రతిపాదన వచ్చిందని, ఇద్దరం కలిసి చర్చించుకున్నామని చెప్పారు. ప్రవీణ్‌కుమార్ బీఎస్పీ హైకమాండ్‌తో మాట్లాడారని, కలిసి పనిచేయాలని స్థూలంగా ఒక నిర్ణయానికి వచ్చామని వివరించారు. మిగిలిన విషయాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. కొన్ని సీట్లలో బీఎస్పీ, మరికొన్ని సీట్లలో బీఆర్‌ఎస్ పోటీచేయాల్సి ఉంటుందని, సీట్ల విషయంపై తదుపరి చర్చిస్తామని, త్వరలో మాయావతితో మాట్లాడతానని తెలిపారు.

**లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీ**

రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీచేయాలని రెండు పార్టీలు నిర్ణయించాయి. సీట్ల సర్దుబాటు, ఎన్నికల ప్రచారం, ప్రచారవ్యూహం తదితర అంశాలపై చర్చించేందుకు త్వరలోనే మరోసారి రెండుపార్టీల నేతలు భేటీ కానున్నారు. సమావేశంలో మాజీ మంత్రులు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రమాదంలో సెక్యులరిజం: ప్రవీణ్‌కుమార్**

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్‌ను కలిసినందుకు చాలా ఆనందంగా ఉన్నదని చెప్పారు. తెలంగాణలోనే కాదు దేశంలో కూడా సెక్యులరిజం ప్రమాదంలో ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. దేశాన్ని చిన్నాభిన్నం చేయడానికి, రాజ్యాంగాన్ని సైతం రద్దు చేసేందుకు బీజేపీ కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. ఈ నేపథ్యంలోనే సెక్యులర్ భావాలు కలిగిన, సెక్యులరిజాన్ని నిరంతరం కాపాడిన బీఆర్‌ఎస్, కేసీఆర్‌తో సమావేశమైనట్టు వివరించారు. ఈ భేటీకి మాయవతి ఆశీస్సులు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ కూడా బీజేపీ మాదిరిగానే మారుతున్నదని, ఆ రెండు పార్టీల ముప్పు నుంచి తెలంగాణను కాపాడటానికి బీఎస్పీ, బీఆర్‌ఎస్ పార్టీలు పార్లమెంట్ ఎన్నికల్లో కలిసి పనిచేయాలని నిర్ణయించాయని తెలిపారు. సీట్ల సర్దుబాటుపై బీఎస్పీ అధిష్ఠానానికి నివేదిస్తామని, పార్టీ పెద్దలు కూడా కేసీఆర్‌తో మాట్లాడుతారని చెప్పారు. రెండు పార్టీల స్నేహం తెలంగాణ ప్రజల జీవితాలను మారుస్తుందన్న ఆశాభావం వ్యక్తంచేశారు. తమ పొత్తును తెలంగాణ ప్రజలు అస్వాదిస్తారని, ఆశీర్వదిస్తారని చెప్పారు. రాష్ట్రంలో నిరుద్యోగులు సంతోషంగా లేరని, ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కాకముందే రోడ్ల మీదికి వచ్చే పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు.

# పాలనకు పాతరేసి నిందలా?

- మూడు నెలల్లోనే కాంగ్రెస్‌పై వ్యతిరేకత
- లోక్‌సభ ఎన్నికల్లో విజయం మనదే
- 8 ఏండ్ల తర్వాత కరెంటు కష్టాలు
- మహబూబ్‌నగర్ నుంచి ఎంపీ బరిలో మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ ముఖ్యనేతల సమావేశంలో కేసీఆర్

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ అధికారంలో లేకపోవడంతో తమకు జరుగుతున్న అన్యాయంపై ప్రజలు ఆలోచిస్తున్నారని బీఆర్‌ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. పాలనను గాలికి వదిలేసి పాత ప్రభుత్వంపై నిందలు వేయడమే లక్ష్యంగా పెట్టకొని పనిచేస్తున్నారని కాంగ్రెస్ నేతలను దుయ్యబట్టారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ స్థానాల పరిధిలోని పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలతో కేసీఆర్ సమావేశమయ్యారు. సమావేశానికి మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, హరీశ్‌రావు, వీ శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విజయుడు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీకి మంచి విజయావకాశాలు ఉన్నాయని చెప్పారు. మూడు నెలలుగా ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని, మన అభ్యర్థులందరూ మంచి మెజార్టీతో గెలుస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ కన్నా మూడునాలుగుశాతం ఓట్లు అదనంగా వచ్చే అవకాశం ఉన్నదని తెలిపారు.

**అప్పుడెవరినీ నిందించలే**

రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా బీఆర్‌ఎస్ ఎప్పుడూ ప్రజల కోసమే పనిచేస్తుందని, గెలుపోటములు రాజకీయాల్లో ఒక భాగమేనని కేసీఆర్ పేర్కొన్నారు. 2014లో బీఆర్‌ఎస్ అధికారం చేపట్టే నాటికి ఆర్థిక పరిస్థితిపై తాను ఎవరినీ నిందించలేదని, ఉన్నదానిని మెరుగుపరుచుకున్నామని గుర్తు చేశారు. 'లంకెబిందెలు ఉంటాయనుకున్నాం' అన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను ఉటంకిస్తూ గుప్తనిధుల కోసం వెతికే దొంగలే లంకెబిందెల కోసం వెతుకుతారని, కష్టపడే మనస్తత్వం ఉన్నవారు అలవోకగా వచ్చే సంపద కోసం ఆశపడరని చెప్పారు. ప్రభుత్వాన్ని నడిపించే క్రమంలో వెసులుబాటు కోసం అప్పులు తెచ్చుకుంటామని, మార్కెట్ బారోయింగ్ పేరుతో ప్రపంచంలోని ప్రతి దేశం, మన దేశంలోని ప్రతి రాష్ట్రం అప్పు చేయక తప్పదని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అత్యంత సంపన్న దేశమైన అమెరికా కూడా అప్పులతోనే ప్రభుత్వాన్ని నడుపుతున్నదని గుర్తుచేశారు. ప్రభుత్వానికి అప్పులు ఉన్నాయనడం తెలివితక్కువతనమని విమర్శించారు.

### మహబూబ్‌నగర్‌కు మన్నె శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ నుంచి సిట్టింగ్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మరోమారు బరిలో ఉంటారని కేసీఆర్ ప్రకటించారు. ఆయన గెలుపునకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అతి త్వరలో జిల్లాలో సభలు, సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి అవసరమైన ప్రణాళికను రూపొందించుకుందామని పేర్కొన్నారు. నాగర్‌కర్నూలు లోక్‌సభ స్థానం అంశంపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటానని చెప్పారు.

**పాలమూరు కరువును కండ్లారా చూశా**

బీఆర్‌ఎస్ సర్కారు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టినప్పుడు ట్రిబ్యునళ్లలో కేసులు వేసి అడ్డుకునే ప్రయత్నం చేసింది కాంగ్రెస్సేనని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ ప్రాజెక్టును పూర్తిచేశామని, కాలువలు తవ్వడం మాత్రమే మిగిలి ఉన్నదని, ఈ ఎండాకాలంలో రెండు నెలలు పనిచేస్తే అవి కూడా పూర్తవుతాయని తెలిపారు. పాలమూరు కరువును తాను కండ్లారా చూశానని, 2001లో ఆర్డీఎస్ వద్ద ఆందోళనలు చేశానని గుర్తు చేసుకున్నారు. పాలమూరు ప్రజల కష్టాలు శాశ్వతంగా దూరం కావాలంటే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తిచేయాల్సిందేనని వివరించారు. రాష్ట్ర ఆవిర్భావానికి ముందే మిషన్ కాకతీయకు రూపం ప్రత్యేక రాష్ట్రం వచ్చి తీరుతుందన్న నమ్మకంతో కొత్త రాష్ట్రంలో ప్రభుత్వ ప్రాధాన్యతలపై దివంగత ఆచార్య జయశంకర్, నీటిపారుదల రంగ నిపుణులు ఆర్ విద్యాసాగర్ మధ్య చర్చ జరిగిందని, ఆ సందర్భంగా 'మిషన్ కాకతీయ'కు అంకురార్పణ జరిగిందని కేసీఆర్ గుర్తుచేశారు. రాష్ట్ర ఏర్పాటుకు 9 నెలల ముందే కాకతీయుల కాలంనాటి గొలుసుకట్టు చెరువులను పునరుద్ధరించాలని సంకల్పించినట్టు చెప్పారు.

> ప్రజా జీవితంలో ప్రజలతో ఉండడం ముఖ్యం. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. ఒక అపజయంతో కుంగిపోవద్దు. బీఆర్‌ఎస్‌కు ఎదురైన అపజయాలకు కుంగిపోతే తెలంగాణ రాష్ట్రమే వచ్చేదే కాదు. రాష్ట్రాన్ని సాధించిన వాళ్లుగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నేతలకు రాష్ట్రంపై ప్రేమ ఎక్కువ. -కేసీఆర్

**ప్రజలకు మేలు చేయాలన్న ఆరాటం**

కొత్త రాష్ట్రంగా ఉద్భవించిన తెలంగాన అనేక అద్భుతాలు చేసిందని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజలకు మేలు చేయాలన్న ఆరాటం, మమకారం బీఆర్‌ఎస్‌కు తప్ప మరొకరికి ఉండదని తెలిపారు. ప్రతీ పనిని ప్రజలపై ప్రేమతో చేశాం తప్పితే రాజకీయ ప్రచారం కోసం కాదని స్పష్టం చేశారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీలు అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల కోసమే పనిచేశాయని ప్రశంసించారు. ప్రత్యేక రాష్ట్రంలో పదేండ్లపాటు అధికారంలో ఉన్న పార్టీగా బీఆర్‌ఎస్‌కు గుర్తింపు ఉన్నదని, ప్రజల పక్షాన నిలబడి కొట్లాడే బాధ్యత కూడా బీఆర్‌ఎస్‌పైనే ఉన్నదని, కలిసి వచ్చే శక్తులన్నింటినీ ఏకం చేసుకుని వెళ్దామని చెప్పారు.

### పంటలు ఎండుతున్నాయి


రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయని, కరెంటు కొరత తీవ్రంగా ఉన్నదని, అన్నదాతలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని కేసీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటికి కూడా కరువు ఏర్పడుతున్నదని, మిషన్ భగీరథ నీళ్లను కూడా సవ్యంగా వాడుకోలేకపోతున్నదంటూ ప్రభుత్వాన్ని విమర్శించారు. ప్రజలకు 8 ఏండ్ల తర్వాత కరెంటు, నీటి కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. రైతుపంటకు బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుక మడత పెడుతున్నదని, మద్దతు ధర రాకపోతేనే బోనస్ ఇస్తామంటూ ఉత్తముచ్చట్లు చెప్తున్నదని మండిపడ్డారు.

**రాములకు ఏం తక్కువ చేశాం?**

నాగర్‌కర్నూలు ఎంపీ పీ రాములు పార్టీ నుంచి వెళ్లిపోవడంపై కేసీఆర్ స్పందించారు. ఎక్కడో ఉన్న రాములును పిలిపించి, ఎంపీ టికెట్ ఇచ్చి పార్టీ మొత్తం వెంట ఉండి ఆయనను గెలిపించిందని చెప్పారు. రాములు కొడుకు రాజకీయాల్లోకి వస్తానంటే జడ్పీటీసీ సభ్యుడిగా అవకాశం కల్పించానని గుర్తుచేశారు. మరిన్ని అవకాశాలు కావాలంటే ఇంకేం ఇస్తామని ప్రశ్నించారు. పార్టీలో అత్యంత గౌరవం ఇచ్చామని, అలాంటి వ్యక్తి తనకు ఇంకా అవకాశాలు కావాలని అనడం అర్థరహితమని పేర్కొన్నారు. స్వార్థపరులు కొందరు పార్టీ నుంచి వెళ్లినా ఫర్వాలేదని స్పష్టం చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో స్థానిక సంస్థల కోటాకు జరిగే ఎన్నికల్లో పార్టీ పోటీ చేస్తుందని వెల్లడించారు.

> కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి నీళ్లను పాకిస్థాన్‌కో, అమెరికాకో పంపలేదు కదా. ఆ నీటితోనే పుట్టలకొద్దీ పంటలు పండాయి. బీఆర్‌ఎస్ సర్కారు చేపట్టిన నీటి సంరక్షణ చర్యలకు పాలమూరు మంచి ఉదాహరణ. బండలా ఉన్న పాలమూరు బంగారు తునకలా అయింది. ఇది అందరికీ కనిపిస్తున్నదే కదా. -కేసీఆర్

## లోకం పోకడ




## లౌకిక శక్తుల పునరేకీకరణ

**బీఆర్‌ఎస్‌తో పొత్తుకు బీఎస్పీ సై**

**15 ఏండ్ల తర్వాత పొత్తుల్లోకి బీఆర్‌ఎస్**

**నాడు తెలంగాణ సాధన కోసం..**

**నేడు రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా**

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): 'ఒక పార్టీని పడగొట్టడమో, మరొక పార్టీని పదవిలోకి తీసుకురావటమో మా ఉద్దేశం కాదు. ప్రజాస్వామ్యం పరిణతి చెందాలి. ప్రజలందరికీ మేలు జరగాలి. అందుకోసం ఎక్కడి దాకైనా కొట్లాడుతాం. కలిసి వచ్చే శక్తులతో కలిసి పోరాడుతాం' అని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ అనేక సందర్భాల్లో వెల్లడించారు. రాష్ట్ర రాజకీయాల్లో మంగళవారం చోటుచేసుకొన్న పరిణామాలు గతంలో కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు సరిపోయే సన్నివేశాన్ని ఆవిష్కృతం చేసింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కలిసి పోటీచేయాలని బీఆర్‌ఎస్, బీఎస్పీ నిర్ణయించుకొన్నాయి. ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల దృష్ట్యా జాతీయ స్థాయిలో లౌకిక, ప్రజాస్వామ్యశక్తుల పునరేకీకరణ జరగాల్సిన అనివార్యత నెలకొన్నదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతున్న క్రమంలో బీఆర్‌ఎస్, బీఎస్పీతో దోస్తీ రాజకీయవర్గాల్లో చర్చనీయాంశమైంది. తాము ఎందుకు బీఆర్‌ఎస్‌తో కలిసి పోటీచేయాలని నిర్ణయించుకున్నామో బీఎస్పీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ కుండబద్దలు కొట్టారు. తెలంగాణలో లౌకికస్వామ్యం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయని, వీటి పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**తెలంగాణవాదంతో గత పొత్తులు**

2009 తరువాత బీఆర్‌ఎస్ మరో రాజకీయ పార్టీతో కలిసి తొలిసారిగా ఎన్నికల్లో పోటీ చేయబోతున్నది. బీఆర్‌ఎస్(నాటి టీఆర్‌ఎస్) పార్టీ ఆవిర్భావం తరువాత జరిగిన 2004లో తొలిసారి ఎన్నికలు జరిగాయి. బీఆర్‌ఎస్ ఆవిర్భావంతో ప్రజ్వరిల్లిన తెలంగాణవాదంతో ఏకీభవించకపోతే సీట్లు కాదు కదా ఓట్లు కూడా రావని భావించిన కాంగ్రెస్ ఆనాడు బీఆర్‌ఎస్‌తో జతకట్టిన విషయం తెలిసిందే. ఆ తర్వాత 2009లో టీడీపీ, సీపీఎం, సీపీఐలతో మహాకూటమి ఏర్పాటులో బీఆర్‌ఎస్ భాగం అయింది. కరుడుగట్టిన సమైక్యవాద పార్టీలను తెలంగాణకు అనుకూలంగా నిర్ణయం తీసుకునేలా కేసీఆర్ నాడు పొత్తు రాజకీయాలు నెరిపారు. 2014, 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఒంటరిగా పోటీ చేసి రెండుసార్లు అధికారాన్ని చేపట్టింది.

**తెలంగాణ పురానా దోస్త్ బీఎస్పీ**

> తెలంగాణకు బీఎస్పీని తెలంగాణ దోస్త్‌గా రాజకీయవర్గాలు అభివర్ణిస్తాయి. యూపీఏ ప్రభుత్వానికి, ప్రణబ్ ముఖర్జీ కమిటీకి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అనుకూలంగా లేఖ ఇవ్వాలని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ గతంలో చేసిన విజ్ఞప్తిని అంగీకరించిన బీఎస్పీ అధినేత్రి మాయావతి అనుగుణంగా లేఖ ఇచ్చారు.

## నేడు బీఆర్‌ఎస్ ధర్నాలు

**ఎల్ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలని డిమాండ్**

**7న కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతి పత్రాలు**

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీ మేరకు ఎల్ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో బుధవారం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు చేయనున్నారు. కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు చెప్పినట్టుగా ఎల్ఆర్‌ఎస్‌ను ఉచితంగా చేయాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తున్నది. రాష్ట్రంలో 25.44 లక్షల మంది ఎల్ఆర్‌ఎస్ దరఖాస్తుదారుల నుంచి రూ.20 వేల కోట్లు వసూలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైందని ఆరోపిస్తున్నది. మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, సీతక్కలు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎల్ఆర్‌ఎస్ డబ్బులు కట్టవద్దని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉచితంగా ఎల్ఆర్‌ఎస్ అమలు చేస్తామని చెప్పిన వీడియోలను ఇప్పటికే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విడుదల చేశారు. ప్రజల దగ్గర ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండానే రెగ్యులరైజ్ చేస్తామన్న హామీకి కట్టుబడి ఉండాలని, నాడు మాటలు చెప్పిన కాంగ్రెస్ నేతలు ప్రస్తుతం మంత్రులుగా ఉన్నారని, వారు దీనిపై సమాధానం చెప్పాలని బీఆర్‌ఎస్ డిమాండ్ చేస్తున్నది. నిరసన కార్యక్రమాలకు ప్రభుత్వం స్పందించకుంటే ఈ నెల 7న జిల్లా కలెక్టర్లు, అర్డీవోలకు విజ్ఞాపన పత్రాలు అందించాలని నిర్ణయించింది. అప్పటికీ కదలికలేకుంటే న్యాయస్థానాలను సైతం ఆశ్రయించేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమవుతున్నది. బుధవారం హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ కార్యాలయం ఎదుట మాజీ మంత్రులు పద్మారావు గౌడ్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, బీఆర్‌ఎస్ నాయకుడు తలసాని సాయికిరణ్, జీహెచ్‌ఎంసీ కార్యాలయం ఎదుట మాజీ మంత్రులు తలసాని, దానం నాగేందర్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్, ముఠా గోపాల్, మేయర్ విజయలక్ష్మి తదితరులు నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్

## మళ్లీ రోడ్లమీదికి వచ్చిన నిరుద్యోగులు • బీఆర్‌ఎస్-బీఎస్పీ పొత్తుతో ప్రజలకు మేలు

- ఈ పొత్తు తెలంగాణ బహుజనుల ఆకాంక్ష
- ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లా ప్రభుత్వ తీరు
- కాంగ్రెస్, బీజేపీ నుంచి రాష్ట్రాన్ని రక్షించాలి
- హస్తం పార్టీ పాలనలో మత ఘర్షణలు
- రాజ్యాంగ రద్దుకు బీజేపీ యత్నం
- 'నమస్తే తెలంగాణ'తో ఆర్‌ఎస్ ప్రవీణ్

హైదరాబాద్, మార్చి 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయిందని, ప్రజాపాలన కాస్తా ప్రజాపీడనగా మారిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. నిరుద్యోగులు మళ్లీ రోడ్ల మీదికి వచ్చారని, ప్రభుత్వ పనితీరు ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లా నడుస్తున్నదని ఆరోపించారు. కాంగ్రెస్ సూడో సెక్యులర్ పార్టీ అని, దేశానికి ఆ పార్టీ వల్ల నష్టం తప్ప లాభం జరగలేదని అన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బీజేపీ చూస్తున్నదని చెప్పారు. తెలంగాణను బీజేపీ, కాంగ్రెస్ నుంచి రక్షించాల్సి ఉన్నదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్- బీఎస్పీ పొత్తు తెలంగాణ బహుజనుల ఆకాంక్ష అని తేల్చిచెప్పారు. ఈ పొత్తుతో ప్రజలకు మంచి జరగబోతున్నదని, రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు తీసుకురాబోతున్నదని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్-బీఎస్పీ పొత్త ఖరారైన నేపథ్యంలో ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూ చేసింది. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే..




**బహుజనులకు న్యాయం జరగాలి**

తెలంగాణను కాంగ్రెస్, బీజేపీ నుంచి రక్షించాలి. రాష్ట్రంలో కోట్ల మంది బహుజనుల ప్రయోజనాలు ప్రమాదంలో ఉన్నాయి. రాజ్యాంగం రద్దు అయ్యే ప్రమాదం ఉన్నది. విచ్ఛిన్నకరమైన పరిస్థితి ఉన్నది. బహుజనులకు న్యాయం జరగాలనేది మా లక్ష్యం. ఎన్డీయేలో గానీ, ఇండియా కూటమిలో గానీ బీఎస్పీ లేదు. ప్రాంతీయ పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని మాయావతి సూచించారు. అందుకు అనుగుణంగానే పొత్తులు పెట్టుకుంటున్నాం. గతంలో మేం వ్యక్తుల మీద, వారి అలవాట్ల మీద, వ్యక్తిగత విషయాలపై పోరాడలేదు. ప్రజల అస్థిత్వాన్ని నాశనం చేసే ప్రమాదం పొంచి ఉన్నప్పుడు ప్రత్యర్థిని ఎదుర్కోవటానికి కలిసి పని చేయాలని నిర్ణయించాం. తెలంగాణ ప్రజలు బీఆర్‌ఎస్-బీఎస్పీ పొత్తును ఆశీర్వదిస్తారని అనుకుంటున్నాం. తెలంగాణ ఉద్యమాన్ని నడిపి, రాష్ట్ర ఏర్పాటుకు కారకులైన బీఆర్‌ఎస్, కేసీఆర్‌తో బీఎస్పీ కలవాలి, కలిస్తే తెలంగాణలో ప్రజలకు న్యాయం చేకురుతుందనే ఆలోచన ప్రజల నుంచి వచ్చింది. ఈ పొత్తు నేను ఎంపీ కావడానికి కాదు. నేను ఎక్కడి నుంచి పోటీ చేయాలనేది, మా పార్టీ నుంచి ఎన్ని సీట్లలో పోటీ చేయాలనే దానిపై క్లారిటీ రాలేదు. సీట్ల సర్దుబాటులో చర్చిస్తాం.

**నీళ్లు లేవు.. కరెంటు కోతలు**

కాంగ్రెస్ ప్రభుత్వం అట్టర్ ఫ్లాప్ అయ్యింది. ప్రజాపాలన కాస్తా ప్రజాపీడనగా మారింది. ప్రజలకు ఏదీ గ్యారెంటీ లేదు. కొత్త ప్రభుత్వ పనితీరు చారాణా చికెన్‌కు బారాణా మసాలా వేసినట్టు ఉన్నది. ఈవెంట్ మేనేజ్‌మెంట్‌లా నడుస్తున్నది. ఎల్బీ స్టేడియంలో మీటింగుల కోసం అధికార యంత్రాంగాన్ని నడిపే పరిస్థితి. సోషల్ మీడియాలో థంబ్‌నెయిల్ పెట్టి అది చేస్తున్నాం.. ఇది చేస్తున్నాం అని అంటున్నారు తప్ప ప్రజలకు ఏమీ జరగటం లేదు. ప్రజావాణి కార్యక్రమాన్ని పెట్టారు. మొదటి రోజు సీఎం వచ్చారు. దరఖాస్తు తీసుకున్నారు. ఆ తర్వాత మంత్రులు పోయారు. ఆ తర్వాత అధికారులూ పోయారు. ఇప్పుడేమో ఎవరికో అప్పగించారు. ప్రజావాణికి ఎన్ని దరఖాస్తులు పెట్టినా, సమస్యలు పరిష్కారం కావటం లేదు. సీఎం రేవంత్‌రెడ్డి సమస్య విన్నానంటున్నారు తప్ప.. ఆ సమస్యను పరిష్కరించానని చెప్పటం లేదు. ఇక రాష్ట్రంలో కరెంటు కోతలు. యాసంగి కోసం నీళ్లు లేవు. డీఎస్సీ 2008 అభ్యర్థులకు న్యాయం జరగటం లేదు.

### కాంగ్రెస్‌కు 12 శాతం ఓట్లు కూడా రావు

కాంగ్రెస్‌కు 12 సీట్లు కాదు 12-13 శాతం ఓట్లు వస్తే చాలా గ్రేట్. బీఆర్‌ఎస్-బీఎస్పీ కలవటంతో కాంగ్రెస్ ఓటు బ్యాంకు గణనీయంగా తగ్గుతుంది. బహుజనులకు దీర్ఘకాలికంగా గొప్ప ప్రయోజనాలు అందే గొప్ప విప్లవాత్మకమైన పరిణామం ఈ పొత్తు. తెలంగాణ సంపదను దోచుకోవాలని బీజేపీ, కాంగ్రెస్ కుట్ర చేస్తున్నాయి. ఈ రెండు పార్టీలు ఒక్కటే. ఈడీ, సీబీఐ, ఎన్నికల కమిషన్ నీరుగారిపోయాయి. కేంద్రంలోని బీజేపీ ప్రయోజనాలే లక్ష్యంగా ఈ సంస్థలు పనిచేస్తున్నాయి.

**లౌకికతత్వానికి కాంగ్రెస్ మోసం**

సెక్యులర్ పార్టీగా చెప్పుకొనే కాంగ్రెస్ హయాంలోనే అనేక మత ఘర్షణలు జరిగాయి. బాబ్రీ మసీదు కూల్చివేత కాంగ్రెస్ హయాంలోనే జరిగింది. పాతబస్తీలో అల్లర్లు జరిగాయి. జన్వాడలో చర్చిపై దాడులు జరిగితే సీఎం రేవంత్‌రెడ్డి స్పందించలేదు. వినాయక మంటపం ధ్వంసం చేస్తే స్పందించలేదు. కాంగ్రెస్ పార్టీ లౌకికతత్వాన్ని మోసం చేస్తున్నది. విచ్ఛిన్నకర అజెండాను ఇక్కడా అమలు చేయాలని బీజేపీ చూస్తున్నది. సీఎం రేవంత్‌రెడ్డి ట్విట్టర్‌లో స్పందిస్తున్నారు కానీ అమలు చేయటం లేదు. అధికారులకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వటం లేదు. గురుకులాల్లో ఐదుగురు ఆత్మహత్యలు చేసుకున్నారు. వీటి గురించి ప్రభుత్వం స్పందించలేదు. మళ్లీ నిరుద్యోగులు రోడ్ల మీదికి వచ్చారు.